గిరిజనులకు దారి కష్టాలు


అధ్వానంగా పాటగూడ వెళ్లే రోడ్డు

- కనీసం రోడ్లు సౌకర్యం కరువు
- నీటిమూటలుగానే నాయకుల హామీలు
- పట్టించుకోని అధికారులు

కెరమెరి: గిరిజన ప్రజలకు దారి కష్టాలు తప్పడం లేదు. ఆదివాసీ గ్రామాలకు బీటీరోడ్లు నిర్మిస్తామని పాలకులు హామీలిస్తున్నా.. అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. ఫలితంగా సంవత్సరాలు గడుస్తున్నా.. ప్రజలకు దారి కష్టాలు తీరడం లేదు. టిమ్లాగూడ, కొలాంగూ, గొర్యాగూడ, చాల్‌బాడి గ్రామాలకు కనీసం రోడ్డు సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. నాయకులు, పాలకులు మారుతున్నా.. వారి తలరాతలు మాత్రం మారడం లేదు. రోడ్డు నిర్మించాలని అధికారులను వేడుకుంటున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. టిమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడ గ్రామాలకు దేవాపూర్ నుంచి సుమారు రెండు కిలో మీటర్లు పూర్తిగా కచ్చ రోడ్డు ఉంది. వర్షాకాలంలో మోకాల్లోతూ బురద ఉంటుంది. దీంతో నడక నరకప్రాయంగా మారుతోంది. చాల్‌బాడికి వెళ్లేందుకు పాటగూడ వరకు మాత్రమే బీటీ రోడ్డు ఉంటుంది. తరువాత అడవుల్లోంచి వెళ్లాల్సి వస్తోంది. పట్నాపూర్ క్రాస్‌రోడ్డు నుంచి పాటాగూడ వరకు బీటీ రోడ్డు కూడా పూర్తిగా అధ్వాన్నంగా మారింది.

వంతెనలు నిర్మించండి

చాల్‌బాడీ గ్రామానికి వెళ్లే దారిలో పాటగూడ వద్ద చెరువుపై , టిమ్లాగూడ, గొర్యాగూడ, కొలాంగూడకు వెళ్లే దారిలో ఖట్టిగూడ వద్ద వాగుపై వంతెనలు నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ఏ చిన్న వర్షం కురిసిన రాకపోకలు నిలిచిపోతాయి. దీంతో బహ్య ప్రపంచానికి దూరంగా ఉండాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

తప్పని తిప్పలు..



రోడ్లు సరిగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. గడిచిన కొన్నేళ్లుగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. అయినా దానికి మరమ్మతులు చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలో లేదు. పూర్తిగా కంకర లేచి నడిచేందుకు వీలు ఉండడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – ఆత్రం పావుగా, పాటగూడ

కంకర పోశారు.. వదిలేశారు


కంకర తేలిన పెసరికుంట రోడ్డు

దహెగాం: మారుమూల గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తున్నా.. కింది స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో రోడ్ల నిర్మాణానికి గ్రహణం పట్టుకుంది. గత మూడు సంవత్సరాల క్రితం ఐటీడీఏ ద్వారా మండలంలోని పోలంపల్లి గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. రెన్యూవల్ బీటీ నిర్మాణం కోసం పెసరికుంట గ్రామానికి సైతం బీనిధులు మంజూరు చేసింది. అయినా.. పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

వర్షాకాలంలో నడవలేని పరిస్థితి..

మండలంలోని పోలంపల్లి గ్రామంలో సుమారు 30 కుటుంబాలు ఉండగా.. 150 వరకు జనాభా ఉంటుంది. దీని పక్కనే మరో దుబ్బగూడెం గ్రామం ఉంటుంది. అక్కడ సుమారు 15 కుటుంబాల వరకు ఉండగా.. 60 వరకు జనాబా ఉంటుంది. రెండు గ్రామాలకు సరైన రోడ్డు మార్గం లేక బురదలోనే నడుచుకుంటు వెళ్తున్నారు. ఈ విషయం అధికారులకు, పాలకులకు విన్నవించినా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.

రూ. 2.50 కోట్లు మంజూరు..

ఐటీడీఏ ద్వారా బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 2.50 కోట్లు మంజూరు చేయగా పనులు ప్రారంభించారు. వర్షాకాలం రాగానే రోడ్డుకు అవసరమయ్యే మెటీరియల్ అందక పనులు నిలిచిపోయాయి. ప్రస్తుం కాగజ్‌నగర్ మండలం అందవెల్లి పెద్దవాగుపై వంతెన పూర్తయి అందుబాటులోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా.. రోడ్డు పనులు మాత్రం ముందుకు సాగడం లేదు. కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేయడంతో దుమ్మంతా పంటలపై పడి పంట రంగు మారుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికై న రైతులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

సన్మానం


రాథోడ్ గులాబ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

వాంకిడి: మండలంలోని సడక్‌గూడ గ్రామంలో మల్టీపర్పస్ సెంటర్ భవన నిర్మాణానికి భూదానం చేసిన రాథోడ్ గులాబ్‌ను బుధవారం గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పీఎం జన్‌మన్ పథకంలో భాగంగా రూ.60 లక్షలతో మంజూరైన మల్టీపర్పస్ సెంటర్ భవనాన్ని సడక్‌గూడ గ్రామంలో నిర్మించనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణానికి 5 గంటల భూమిని దానం చేసిన రాథోడ్ గులాబ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పటేల్ ఆత్రం గుండయ్య, మాజీ సర్పంచ్ సీడం అన్నిగా, గ్రామస్తులు సీడం భీము, ఆత్రం భగ్వంత్‌రావు, సీడం మారు, ఆత్రం భీము, రాథోడ్ ప్రభు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధి గ్రామసభలు

దహెగాం: మండలంలో 2025– 26 ఆర్థిక సంవత్సరానికి ఉపాధిహామీ పథకం కింద పనుల గుర్తింపు కోసం నేటి నుంచి అన్ని పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో రాజేందర్ బుధవారం తెలిపారు. ఎంపీడీవో, ఏపీవో రెండు బృందాలు గ్రామసభలు నిర్వహిస్తాయన్నారు. అన్ని పంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తున్నందున ఉపాధి కూలీలు, రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు. 25 నుంచి వచ్చే నెల 25 వరకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన సీఐ


ఎస్పీకి పూలమొక్క ఇస్తున్న సీఐ రవీందర్

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా బుద్దె రవీందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్‌రావ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. బుద్దె రవీందర్ గతంలో ఇంటలిజెన్స్ విభాగంలో ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న నాయకులు

బెజ్జూర్: మండల కేంద్రంలో మత్స్యకారులు గంగామాత విగ్రహ ప్రతిష్ఠాపనను బుధవారం ఘనంగా నిర్వహించారు. బాజాభజంత్రీలు, మంగళహారతుల మధ్య ఊరేగింపుగా గంగామాత విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూర్ల ఇస్తారి, ఉపాధ్యక్షుడు పాకాల బిచ్చయ్య, కులపెద్దలు గుమ్ముల బాలయ్య, గాండ్ల వాగయ్య, గాండ్ల పోషయ్య, ఎల్లెల భీమయ్య, మత్స్యకార యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

కాగజ్‌నగర్ రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకంలో వచ్చే ఆర్థిక సంవత్సరం 2025– 26 సంవత్సరంలో పనుల ఎంపికపై మండలంలోని అంకుసాపూర్‌లో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో రమేశ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కుంటలు, ఫాంపండ్‌లు, పండ్ల తోటల పెంపకం, తదితర పనులు చేపట్టుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీవో బుచ్చన్న, ఈజీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


పశువుకు టీకా వేస్తున్న జితేందర్

బెజ్జూర్: మండలంలోని రెబ్బెన గ్రామంలో బుధవారం దాదాపు 300 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్య సహాయకుడు జితేందర్ తెలిపారు. రైతులు, పశుపోషకులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర మనోహర్, సిబ్బంది సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వసతులు కల్పిస్తున్నాం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలోని బీసీ అభివృద్ధి శాఖ పరిధిలోని అన్ని వసతిగృహాల్లో మెరుగైన వసతులు కల్పిస్తున్నామని జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బీసీ పోస్టుమెట్రిక్ (బాలుర) వసతి గృహంలో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారి సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత, హెచ్‌డబ్ల్యూవో శివకుమార్ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం

తాంసి: అనారోగ్యంతో బాధపడుతున్న చిన్ననాటి మిత్రుడికి తోటి మిత్రులు ఆర్థిక సాయం అందించారు. భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన కె.రాజు గుండెనొప్పితో గత కొంత కాలంగా బాధపడుతున్నాడు. బాధితుడికి వైద్య చికిత్సల కోసం కప్పర్ల పాఠశాలలో 1990లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆర్థికసాయం చేశారు. బుధవారం గ్రామానికి వెళ్లి రూ.10 వేల నగదు తక్షణం అందజేసి అండగా ఉంటామని భరోసానిచ్చారు. పూర్వవిద్యార్థులు గంగాధర్ రెడ్డి, మునీర్‌ఖాన్, భూపతి, గంగాధర్, గంగన్న, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఖాదీ మేళా సద్వినియోగం చేసుకోవాలి


ఖాదీ వస్త్రాలు పరిశీలిస్తున్న జీఎం శ్రీనివాస్

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్ క్లబ్‌లో వావిలాల ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ (జమ్మికుంట) వారు ఏర్పాటు చేసిన ఖాదీ మేళాను సింగరేణి ఉద్యోగులు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా జీఎం శ్రీనివాస్ అన్నారు. బుధవారం మేళాను ప్రారంభించి, మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్టాల్‌లోని వస్త్రాలను పరిశీలించారు. రాయితీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూజీఎం కె. రాజమల్లు, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, నిర్వాహకులు చంద్రమౌళి, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ సిబ్బంది

చింతలమానెపల్లి: రైతులు నీటి సరఫరాకు వినియోగించే మోటార్లకు కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని రవీంద్రనగర్ సబ్‌స్టేషన్ ఫోర్‌మెన్ నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని గంగాపూర్ గ్రామం శివారులో విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట నిర్వహించారు. రైతులతో మాట్లాడి పలు విషయాలపై అవగాహన కల్పించారు. కెపాసిటర్లు బిగించడం ద్వారా మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్లు దుర్గం మాధవ్, ప్రవీణ్, సిబ్బంది లక్ష్మి నారాయణ, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మండలంలోని కోసిని గ్రామంలో బుధవారం పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యుత్‌కు సంబంధించి ఎలాంటి అంతరాయలు ఉన్న సంబంధిత సిబ్బందికి తెలియజేయాలని రూరల్ ఏఈ రాంప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ లైన్‌మెన్ విలాస్, లైన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సత్తయ్య, అసిస్టెంట్ లైన్‌మెన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి


అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

పెంచికల్‌పేట్: గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మండల ప్రత్యేకాధికారి ఈఈ ప్రభాకర్ రావు అన్నారు. మండలంలోని లోడుపల్లి, కొండపల్లి, జైహింద్‌పూర్ గ్రామాల్లో పర్యటించారు. పంచాయతీల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. అనంతరం లోడుపల్లిలో ప్రాథమికోన్నత, గిరిజన, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కొండపల్లి, జైహింద్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ బడులను తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో అల్బర్ట్, ఎంఈవో రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

టీకాలపై అవగాహన


మాట్లాడుతున్న హెచ్ఈవో రవిదాస్

వాంకిడి: మండలంలోని ఖిరిడి ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, చిన్న పిల్లలకు క్రమం తప్పకుండా తీసుకోవాల్సిన టీకాల అవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ పెందూర్, ఏఎన్ఎం కృష్ణ కుమారి, సౌమ్య పాల్గొన్నారు.

బ్యాంక్ సేవలపై అవగాహన

ఇంద్రవెల్లి: మండలంలోని తెజాపూర్, ధర్మసాగర్ గ్రామాల్లో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో బ్యాంక్ సేవలపై రైతులకు, ఖాతాదారులకు అవగాహన కల్పించారు. అకౌంటెంట్ ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో అటల్ పెన్షన్ యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, జనరల్ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఖాతాదారులు, తదితరులు పాల్గొన్నారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత


పట్టుబడిన పశువుల వాహనం

వాంకిడి: అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు. కెరమెరి మండలానికి చెందిన షేక్ తాజొద్దిన్ మంగళవారం రాత్రి 10 గంటలకు పశువులను బొలేరొ వాహనంలో తరలిస్తున్నాడు. ఇందాని ఎక్స్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక చెక్‌పోస్ట్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహించగా.. ఎలాంటి ఆధారాలు లేకుండా పశువులను తరలిస్తున్న వాహనం పట్టుబడింది. నిందితుడిపై కేసు నమోదు చేసి పశువులను కాగజ్‌నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి


పాసుబుక్‌లతో ఆరెగూడ విద్యార్థులు

కాగజ్‌నగర్ రూరల్: విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని ఆరెగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాంకు పాసు బుక్‌లు పంపిణీ చేశారు. విద్యార్థి దశ నుంచే పొదుపు అలవాటు చేసుకునే ఉద్దేశంతో ఆర్థిక అక్షరాస్యత పెంపొందించేందుకు పాసు బుక్‌లు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రధానోపాధ్యాయులు పర్శ చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

'సెల్‌ఫోన్ పోతే ఆందోళన వద్దు'

ఇంద్రవెల్లి: సెల్‌ఫోన్ పోయిన, చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని, సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోగొట్టుకున్న నాలుగు సెల్‌ఫోన్లను సంబంధిత వ్యక్తులకు అప్పగించారు. వినియోగదారులు తమ మొబైల్ ఫోన్ల వివరాలను సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుంటే పోగొట్టుకున్న ఫోన్‌ను స్వాధీనం చేసుకోవచ్చన్నారు.

దేశీదారు పట్టివేత


పట్టుకున్న దేశీదారుతో ఎక్సైజ్ పోలీసులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం సరిహద్దు వద్ద అక్రమంగా తరలిస్తున్న దేశీదారు మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కౌటాల సీఐ ముత్యం రమేశ్‌ల ఆధ్వర్యంలో గూడెం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించామన్నారు. తనిఖీలో మహారాష్ట్ర నుంచి మండలంలోని గూడెంకు చెందిన బొమ్మ సాయిక్రిష్ణ 82 దేశీదారు సీసాల మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డాడు. దేశీదారు సీసాలను పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 7380 రూపాయలు ఉంటుందన్నారు.

కాగజ్‌నగర్ రూరల్: మహారాష్ట్ర నుంచి కాగజ్‌నగర్‌కు అక్రమంగా తరలిస్తున్న దేశీదారు బాటిళ్లను పట్టుకున్నామని బుధవారం కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. మహారాష్ట్రలోని వీరూర్ గ్రామం నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి రతన్‌లాల్ టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంపై 200 దేశీదారు మద్యం సీసాలు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న దేశీదారు విలువ రూ. 8 వేల రూపాయలు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

కౌటాల(సిర్పూర్): పోరాట యోధుడు కుమురం భీం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాంతయ్య మాట్లాడుతూ కుమురంభీం జల్ జంగల్ జమీన్ నినాదంతో గిరిజనుల కోసం అలుపెరగని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మన్నెవార్ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు, మండల అధ్యక్షుడు నాయిని సిద్దయ్య, నాయకులు ఆత్రం సత్తయ్య, కుర్మ రాజు, మడావి పోచాని తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి


పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈవో

నార్నూర్: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని ఎంఈవో పవార్ అనిత అన్నారు. బుధవారం మండలంలోని సుంగాపూర్ గొండుగూడ ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాల రికార్డు నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యానందించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలన్నారు. పాటించని వారి బిల్లులు నిలిపి వేస్తామన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి


పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీనివాస్

చింతలమానెపల్లి: పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ రావు అన్నారు. మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయాన్ని ఎంపీడీవో కోట ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులను ప్రశ్నించి నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణ, వంటగదిలను పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట ఎంపీవో సుధాకర్ రెడ్డి, కార్యదర్శి ఆసిఫ్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా :
9010608462
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కొమురంభీం ఆసిఫాబాద్ : తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.విజయ్‌కుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899